

299 మంది విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న నోటు పుస్తకాలను కూటమి పార్టీ నాయకులు, వాసంశెట్టి సత్యం పంపిణీ చేశారు. మొత్తం 299 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎ.వీరన్న, పూర్వ విద్యార్థులు మేడిశెట్టి శేషారావు, కంచుమర్తి బాబూరావు, సిరిగినీడి దుర్గాప్రసాద్, గ్రంథాలయ అధికారి నిమ్మ కాయల చక్రధర్, పీడీ జంపని రఘురాం అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



అందజేస్తున్న కూటమి పార్టీ నాయకులు

గ్యాస్ భారం మోయలేం..

- గ్యాస్ ధర పెంపుపై ప్రజల ఆగ్రహం
- జిల్లాలో ప్రజలపై రూ.3.75 కోట్ల భారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులపై మళ్లీ భారం మోపింది. ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 మేర ధరలు పెంచుతున్నట్లు చమురు సంస్థలు ప్రకటించాయి. పెరిగిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.840 నుంచి రూ.890కు చేరింది. డెలివరీ బోయ్ ఛార్జీలు రూ.30 కలిపి వినియోగదారులు రూ.920 చెల్లించాల్సి ఉంది. ఆయిల్ కంపెనీల ధరల పెంపుపై ప్రభుత్వ నియంత్రణను రద్దు చేయడంతో అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్, గ్యాస్ ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రతి నెలా వంట గ్యాస్‌పై క్రమం తప్పక రూ.25 చొప్పున పెంచిన విషయం విదితమే. కొంత కాలం వ్యవధి అనంతరం తాజాగా రెట్టింపు ధర పెంచడం కొనుగోలుదారులను కలవరానికి గురి చేస్తోంది. మోడీ ప్రభుత్వం తీరుపై వినియోగదారులలో అసహనం వ్యక్తం మవుతోంది. ధరలు నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు. ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు ధర్నా చేపట్టారు.



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 16.77 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో గృహావసరాల వినియోగదారులు 13 లక్షల మంది ఉన్నారు. మరో 2 లక్షల మంది వాణిజ్య సిలిండర్ల వినియోగదారులు, మిగిలిన వారు ఉజ్వల పథకం లబ్ధిదారులు ఉన్నారు. నెలలో దాదాపు 7.50 లక్షల గ్యాస్ సిలెండర్ల వినియోగం ఉంటుందని ఒక అంచనా. గ్యాస్ సిలిండర్ ధరలను ఆయిల్ కంపెనీలు అమాంతం పెంచేస్తున్నాయి. వంట గ్యాస్‌పై మరో రూ.50 పెరగడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. వాణిజ్య సిలిండర్ల ధర పెంపు చిరు వ్యాపారులకు గోరు చుట్టుపై రోకలి పోటు చందంగా పరిస్థితి తయారైందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గ్యాస్ ధరలు పెంచేయడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని సామాన్యులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని ప్రజలపై రూ.3.75 కోట్ల అదనపు భారం

జిల్లాలోని గ్యాస్ వినియోగదారులపై నెలకు రూ.3.75 కోట్ల అదనపు భారం పడుతోంది. 2019 ఏప్రిల్ నుంచి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. అప్పుడు రూ.734 ఉండగా 2020 మార్చిలో 839, 2021 అక్టోబర్ నాటికి 930కి పెరిగింది. 2022లో మూడుసార్లు, 23లో నాలుగుసార్లు, 2024లో ఆరుసార్లు చొప్పున ధరలు పెరిగాయి. ఎన్నికల ముందు స్వల్పంగా ధరలు తగ్గించిన కేంద్ర ప్రభుత్వం మరోసారి గుదిబండ మోపింది. తాజా పెంపుతో గ్యాస్ ధర రూ.890కి చేరింది. మరోవైపు సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో డెలివరీ ఛార్జీలు ఒకొక్క ప్రాంతంలో ఒకొక్క విధంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం రూ.30 మాత్రమే వసూలు చేయాలి. క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రూ.50 నుంచి రూ.60 వరకూ వసూలు జరుగుతోంది.

ధరలను నియంత్రించాలి

ప్రతి ఇంటికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు వాగ్దానాలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం మూడు మాత్రమే నంటూ మాట మార్చారు. అవి కూడా నిబంధన పేరుతో కొందరికే పరిమితం చేశారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చైనా రాష్ట్ర ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపట్టి ప్రజలకు భరోసా కల్పించాలి.

- జి.దుర్గ, కాతేరు, రాజమహేంద్రవరం రూరల్

సామాన్యులపై మోయలేని భారం

సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల ముందు ఉచిత గ్యాస్ సిలిండర్లు అంటూ హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిబంధనల సాకుతో మంగళం పలికారు. ఇప్పటికే నిత్యావసరాలు భగ్గుమంటున్నాయి. ధరల నియంత్రణకు ఎటువంటి చర్యలూ లేవు. ఫలితంగా రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. తాజాగా ధరల పెంపు వంటింట్లో చిచ్చుపెడుతోంది. ప్రభుత్వం గ్యాస్ ధర పెంపుపై పునరాలోచించాలి.

- కె.ఝాన్సీ లక్ష్మి, సీతంపేట, గృహిణి.

ఈ భారాలు మోయలేం...

ఒక పక్క విద్యుత్ ఛార్జీలను పెంచేస్తున్నారు. మరో పక్క పెట్రోలు ఛార్జీలూ అదే బాట పట్టాయి. ఇప్పుడు కొత్తగా గ్యాస్ బండపై మరో రూ.50 భారం వేశారు. ఈ భారాలు మోసే స్థితిలో లేము. వెంటనే గ్యాస్ ధరను తగ్గించాలి. ధరల పెరుగుదలతో కుటుంబ పోషణ ఇప్పటికే కష్టంగా మారింది. సామాన్యులు అన్నం తినే పరిస్థితి కూడా లేకుండా ఉంది.

- యు.శాంతిసరస్వతి, ఆదర్శ్, నగర్, రాజమహేంద్రవరం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని వద్దిపర్రు గ్రామంలో అమలాపురం-బొబ్బర్లంక ప్రధాన రహదారి నుంచి రజకుల పేటకు వెళ్లే ఏటిగట్టు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధులు రూ.50 లక్షలతో ఈ పనులను చేపట్ట నున్నారు. అనంతరం లొల్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లా డారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకో వడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఎక్కడో సుదూర ప్రాంతాల్లోని మిల్లుకు తీసుకెళ్లేవారని గుర్తు చేశారు. అమ్మిన సొమ్ము ఎప్పుడు వస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొని ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లోనే రైతుల నుంచి ధాన్యం సేకరిస్తు న్నార న్నారు. 48 గంటల్లోనే డబ్బులు జమచేస్తు న్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకట రాజు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాధం, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



లొల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - పి గన్నవరం

రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పి.గన్నవరం ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరంలో ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజవర్గం పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన 26 మంది లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.17,32,310 చెక్కులతో పాటు సిఎం సందేశ పత్రాలను ఎంఎల్‌ఎ అందజేశారు. అనారోగ్యానికి గురై వైద్య చికిత్సలు చేయించుకున్న బాధితులను ఆర్థికంగా ఆదుకునేందుకు సిఎం సహాయనిధి ఆసరాగా నిలుస్తుందని అన్నారు. వైద్యం విషయంలో పేద ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో సిఎం సహాయ నిధి ద్వారా నిత్యం ఎంతో మంది పేదలకు వైద్యానికైనా ఖర్చులు అందజేస్తున్నారని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా ఎంఎల్‌ఎకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, డొక్కా నాథ్ బాబు, జనసేన నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, నియోజకవర్గ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ గిడ్డి

ఘనంగా అభ్యుదయ రచయితల సంఘ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మండపేట

మండలం ద్వారపూడిలో అభ్యుదయ రచయితల సంఘం 90వ వార్షికోత్సవం సంఘం జిల్లా అధ్యక్షులు గండి స్వామిప్రసాద్ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు సెల్‌ఫోన్ల మాయలో పడి పుస్తకాల్లో నిక్షిప్తమైన జ్ఞానాన్ని వదిలేస్తున్నారని అన్నారు. మొబైల్ ఫోన్లతో కాలాన్ని గడుపుతూ విలువైన సమయాన్ని వథా చేసుకుంటున్నారని అన్నారు. జ్ఞానం కోసం పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని అన్నారు. గ్రంథాలయ పునర్వికాస వైభవం కోసం అభ్యుదయ రచయితల సంఘం భాగస్వామ్యంతో ఏప్రిల్ 27 విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అభిమానులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా వర్గ సభ్యులు ప్రముఖ కవులు బండారు రాము, తూలూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గండి స్వామి ప్రసాద్

వికలాంగుల పట్ల శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వికలాంగుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపిడిఒ బికె ఎస్‌ఎస్.వెంకట్రామన్ అన్నారు. గురువారం లొల్ల భవిత కేంద్రం వద్ద రావులపాలెం పారా సంస్థ ఆధ్వర్యంలో కేర్ గివెర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. పారా సంస్థ డైరెక్టర్ థామస్ మాట్లాడుతూ ఒకరికొకరు సహాయం చేసుకున్నప్పుడే ఈ సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అధికారుల చేతుల మీదుగా పిల్లలకు కావాల్సిన టిఎల్‌ఎంకిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం బ్లాక్ కోఆర్డినేటర్ ప్రభాకర్ దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా దాట్ల పృథ్వీరాజ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

టిడిపి యువ నాయకుడు దాట్ల పృథ్వీరాజ్ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక పార్టీ కార్యాలయం నందు నిర్వహించినవీ వేడుకల్లో పృథ్వీరాజ్ పాల్గొని కేకు కట్ చేసి అభిమానులు పంచారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు కూటమి నాయకులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముమ్మిడివరం బల్ల గేటు సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్లో టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకల్లో పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్లో పేదలకు ఉచితంగా భోజన సదు పాయం ఏర్పాటు చేశారు. ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పళ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం బాలయోగి ఆశ్రమం లో ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. సోమిదేవరపాలెంలో అడబాల సతీష్ కుమార్ ఇంటి వద్ద పృథ్వీరాజ్‌కి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, గుత్తుల సాయి, గొల్ల కోటి దొరబాబు, అర్ధాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణ కుమార్, ములపర్తి బాలకృష్ణ, గుద్దటి జమ్మి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల వివిధ మండలాల్లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం నేడు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆశాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రామచంద్రపురం: శుక్రవారం ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు మండలంలో 33 / 11 కే.వి. ద్రాక్షారామ సబ్ స్టేషన్ లో హసన బాధ ఫీడర్ అత్యవసర మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఇఇ రత్నాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల హసన్ బాద, ఉండూరు, భీమక్రోసుపాలెం, తాటిపల్లి ,కాపవరం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడు నని తెలిపారు. అదేవిధంగా చోడవరం సబ్ స్టేషన్ లో11 కేవి ఇండస్ట్రియల్ ఫీడర్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ క్రింది తెలిపిన చోడవరం, నరసరావుపేట, ఓదురు యనమదల, ఆక్వా సర్వీసులకు రైస్ మిల్లులకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. **కపిలేశ్వరపురం:** మండలంలోని అంగర 33/11 కె.వి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం విద్యుత్ శాఖ ఇఇ కె.రత్నాలరావు ఒక ప్రకటలో తెలిపారు. కపిలేశ్వరపురం ఫీడర్‌లోని విద్యుత్ తీగలపై చెట్లు కొమ్మలు తొలగించడం, మరామత్తులు కారణంగా ఫీడర్ పరిధిలోని కపిలేశ్వరపురం, వెదురుమూడి, అంగర, పడమర ఖండ్రిక, గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. **ఉప్పలగుప్తం:** ఉప్పలగుప్తం 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లలో శుక్రవారం మరమ్మతులు చెట్ల కొమ్మలు తొలగించడం తదితర వాటి కారణాలవల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఇఇ కె.రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలైన ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, చీకట్ల పాలెం, పేరాయి చెరువు, వాడపర్రు, కూనవరం, కిత్తనచెరువు, మునిపల్లి, సన్నవిల్లి, పెరగాడవిల్లి, చినగాడవిల్లి, వానపల్లిపాలెం, ఎన్. కొత్తపల్లి, రాఘవులపేట గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు. అలాగే చల్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలైన చల్లపల్లి, గోపవరం, సరిపల్లి, ఎస్.యానాం, వాసాలతిప్ప, నక్కా రామేశ్వరం గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు.

సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రతీ ఒక్కరూ సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ ఎఇ దుర్గాప్రసాద్ అన్నారు. జొన్నాడలో ఆయన శుక్రవారం పర్యటిస్తూ విద్యుత్ లైన్లను పరిశీలించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటు చేసుకున్న వారికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. గృహ వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. అలాగే గృహ విద్యుత్ వినియోగంలో అదనపు లోడ్ను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. గహ వినియోగానికి సంబంధించి చాలా వరకు మొదట ఒక కిలో వాట్ లోడ్తోనే కనెక్షన్ తీసుకుంటారని, అయితే ఆ తర్వాత ఏసీలు, ఇతరత్రా వాటితో లోడు రెండు, మూడు కిలో వాట్స్ పెరుగుతుందని అన్నారు. వినియోగించిన విద్యుత్కు వినియోగదారులు ఛార్జీలు చెల్లిస్తున్నప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్స్ లోడు పెరుగుతుం డటం వల్ల కాలిపోవడం, లో ఓల్టేజీ, హైవోల్టేజీ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అదనపు లోడ్ను క్రమబద్ధీకరించుకుంటే ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యంపై పూర్తి స్పష్టత వస్తుందన్నారు. అదనపు లోడు క్రమబద్ధీకరణకు డిపార్టుమెంటుకు చెల్లించాల్సిన రుసుములో 50 శాతం రాయితీతో ఎపిఎస్‌పిడిసిఎల్ వెబ్సైట్ www.apspdcl.on సమీపంలోని మీ సేవ, గ్రామ, వార్డు సచివాలయాల్లో చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశం ఏప్రియల్ 30 వరకు ఉందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు కైలాస భూమికి ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తపేటలో సూర్య గుండాల పాయ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కైలాస భూమికి శనివారం ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ప్రారంభోత్సవం చేస్తారని లయన్స్ క్లబ్ అధ్యక్షులు, కైలాస భూమి ఛైర్మన్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఎన్‌వివి ఎస్‌ఎస్.రెడ్డియ్య గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ హరీష్‌మాథూర్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఛైర్మన్‌తో పాటు సభ్యులు కంఠంశెట్టి శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పరిశీలించారు.



ప్రాంగణంలో ఛైర్మన్ తో పాటు కార్యవర్గ సభ్యులు

యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణంరాజు మృతి

ప్రజాశక్తి-ఐ.పోలవరం

కేశనకుర్రుపాలెం గ్రామానికి చెందిన యుటిఎఫ్ సీనియర్ నాయకులు, యుటిఎఫ్ మండల మాజీ అధ్యక్షులు పొత్తూరి కృష్ణంరాజు(74) అనారోగ్యం కారణం వల్ల గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా యుటిఎఫ్ ఉపాధ్యక్షులుగా అనేక సేవలు అందించారు. ఆయన లేని లోటు తీరనిదని యుటిఎఫ్ మండల శాఖ సంతాపం తెలిపింది.

కృష్ణంరాజు సేవలు చిరస్మరణీయం

అమలాపురం: ఐ.పోలవరం మండల అధ్యక్షునిగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యుటిఎఫ్ ఉపాధ్యక్షులుగా పని చేసినటువంటి రిటైర్డ్ ఉపాధ్యాయులు సీనియర్ కార్యకర్త పి.కృష్ణంరాజు సేవలు చిరస్మరణీమని యుటిఎఫ్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. పి.కృష్ణంరాజు గురువారం హైదరాబాద్‌లో మరణించారని, ఆయ అంత్య క్రియలు శుక్రవారం ఉదయం అయన స్వగ్రామం ఐ.పోల వరం మండలం కేశనకుర్రు గ్రామంలో జరుగుతాయని అన్నారు. అయన మార్గదర్శకత్వంలో తయారైన ఎంతోమంది కార్యకర్తలు ఆయా జిల్లాల్లో ప్రస్తుతం ఉద్యమంలో, నాయకత్వంలో ఉన్నారంటే ఆ ఘనత కృష్ణంరాజుకే దక్కుతుందన్నారు. ఆయన మృతికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ పక్షాన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్ర, మేడిచర్ల విఎఎస్.సుబ్బా రావు తెలిపారు.



పి .కృష్ణంరాజు(ఫైల్)

ఘనంగా ప్రపంచ హోమియో దినోత్సవం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక గౌతమి హోమియో క్లినిక్‌లో అంతర్జాతీయ హోమియో దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. హోమియో వైద్య పితామహులు క్రిస్టియన్ ఫెడ్రిక్ సామ్యూల్ హనీమన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ హోమియో వైద్యులు జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ చల్లా రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు, డాక్టర్ బిక్కిన కృష్ణారెడ్డిచౌదరి పాల్గొన్నారు. డాక్టర్ బిక్కిన మాట్లాడుతూ రోగిని సానుభూతితో పరిశీలించి పరీక్షించినప్పుడు మాత్రమే ఆ వైద్య విధానం విజయవంతం అవుతుందన్నారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో హోమియో వైద్య విధానం పట్ల ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమి హోమియో క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ చల్లా మెహర్ ప్రసన్న, సూర్యచంద్ర హోమియో మార్కెటింగ్ డైరెక్టర్ సలాది దుర్గాప్రసాద్, హోమియో వైద్యులు డాక్టర్ నీరజ, డాక్టర్ రంజని, కళా మిత్ర మీరాబి మీరా సాహెబ్, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్, అంకం భాస్కరరావు, లైన్స్ క్లబ్ నాగేంద్రబాబు హోమియో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాజీ శాసన సభ్యులు డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి చేతుల మీదుగా డాక్టర్ రవికుమార్ డాక్టర్ ప్రసన్న దంపతులను సత్కరించారు. ప్రపంచ హోమియో దినోత్సవం పురస్కరించుకొని ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ చల్లా రవికుమార్‌ను జిల్లా పిఎంపి అసోసియేషన్ అధ్యక్షులు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా 60 ఏళ్ల అసోసియేషన్ సావనీర్‌ను ఆయన అందించారు. ఈకార్యక్రమంలో మండిపూడి చంద్రశేఖర్, పుచ్చల కాశీ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమం లో మాట్లాడుతున్న డాక్టర్ బిక్కిన

మృతుని కుటుంబానికి రూ.1.16 లక్షల సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణానికి చెందిన వ్యాన్ డ్రైవర్ సిద్ధనాతి నాని ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీ లక్ష్మీ గణపతి టాటా మ్యాజిక్ యూనియన్ మృతుని కుటుంబానికి రూ.1,16,147 ఆర్థిక సహాయం అందజేశారు . ఈ మొత్తాన్ని రామచంద్రపురం రవాణా శాఖ అధికారి రాజేంద్రప్రసాద్ చేతుల మీదగా కొయ్యలగూడెం సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండబాబు, వెంకటేష్ వరప్రసాద్, వాలిశెట్టి శీను వాసంశెట్టి శ్రీను, సురేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న టాటా మ్యాజిక్ యూనియన్

ఆయిల్ పామ్‌తో లాభాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రైతులు ఆయిల్ ఫామ్ సేద్యం చేయడం ద్వారా లాభాలు సాధించవచ్చునని ఆయిల్ పామ్ కంపెనీ జిఎం కెజె.ప్రభాకర్ అన్నారు. గురువారం అంకంపాలెం, ర్యాలీ, మెర్లపాలెం గ్రామాలలో సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ వారిచే సామూహిక ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని అంకంపాలెం గ్రామ రైతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమం అంకంపాలెం, ర్యాలి మీదుగా మెర్లపాలెం గ్రామం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ విస్తరణ అధికారులు,గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.



మనోవికాస కేంద్రంతో నిర్వహిస్తున్న వేడుకలు

దళిత సేన ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కొంకాపల్లి హరి మనోవికాస కేంద్రంలో గల మానసిక వికలాంగుల పాఠశాల నందు గురువారం ఘనంగా అంబేద్కర్ జయంతి నిర్వహించారు. దళిత సేనా అధ్యక్షుడు డేవిడ్ అంబేద్కర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. కోనసీమ కేర్ ఆసుపత్రి అధినేత డాక్టర్.కారెం.రవితేజ, విజయ మెడికల్ కేర్ ఆసుపత్రి అధినేత డాక్టర్.రత్న బెనర్జీ అంబేద్కర్ గంటా కలిసి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేకును కట్ చేశారు. దళిత సేన గ్రూప్ సభ్యులు మానసిక వికలాంగుల పిల్లలకు ఎయిర్ కూలర్‌ను బహుమతిగా ఇచ్చారు. వస్త్ర దానం, భోజనాలు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వాకపల్లి హరీష్ కుమార్, సాపే రమేష్, తానంకి వసంత కుమార్, పరమట వంశీ, గోసంగి సంతోష్, నేల ప్రశాంత్, గోసంగి జాకబ్ ప్రభు, కమిడి సామ్యూల్ జ్యోతి, కమిడి బాలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, గర్భిణుల పౌష్టికాహారం తీసుకుని వైద్య సలహాలు పాటించాలని అంగర పిహెచ్‌సి వైద్యాధికారి పి.రత్నకుమారి అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కపిలేశ్వరపురం మండలంలోని అంగర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు నిర్వహించిన ప్రత్యేక వైద్య పరీక్షల్లో ఆమె పాల్గొన్నారు. 23 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆసుపత్రిలో ప్రసవాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, స్టాఫ్ నర్స్ జె.బంగారుపాప, హెల్త్ విజిటర్ టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పి కె.రమాదేవి, తదితరులు అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రత్నకుమారి

నేరాలు ఘోరాలు

వాడపల్లిలో బంగారం చోరీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి బీరువాలో ఉన్న బంగారం దొంగిలించిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు . గురువారం వారు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన కుప్పల సత్తిపండు పూల వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 8న రాత్రి 7 గంటల సమయంలో కుటుంబ సమేతంగా వాడపల్లి వెంకటేశ్వర స్వామి కళ్యాణం చూడ్డానికి వెళ్లాడు. కళ్యాణం అనంతరం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తీసి ఉండడం గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలో ఉన్న 4 కాసులు బంగారం లేకపోవడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని భావించి స్థానిక స్టేషన్‌లో సత్తిపండు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ ఎస్.రాము గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

వ్యక్తి కిడ్నాప్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - రావులపాలెం

మండల కేంద్రం రావులపాలెం లో వ్యక్తి కిడ్నాప్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కెవి. రమణారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక ఆదిలక్ష్మి నగర్ ఐదవ వీధికి చెందిన సిరగం మురళీహర సుబ్బారావు ఈ నెల 9నవ అర్ధరాత్రి మోటార్ సైకిల్ పై వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన సంజు అనుచరులు సంజయ్, రమేష్, గోపయ్య కారుపై వచ్చి గంటి గ్రామానికి చెందిన రుద్ర సురేష్ ద్వారా వచ్చి సుబ్బారావును కిడ్నాప్ చేశారన్నారు. సుబ్బారావును మహారాష్ట్ర తీసుకెళ్లారన్నారు. వ్యాపార లావాదేవీలు కారణంగానే ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు సుబ్బారావు కుమారుడు సిరగం శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై మాజీ రౌడీ షీటర్ దాడి

పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం నల్ల వంతెన రజక పేటకు చెందిన టేకు వెంకటలక్ష్మిపై మాజీ రౌడీషీటర్, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ అతని అనుచరులు కత్తులతో దాడి చేశారు. ఈ ఘటన ఈనెల మూడో తేదీ గురువారం రాత్రి 10 గంటలకు చోటు చేసుకుంది. ఈ మేరకు విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణతో కలిసి బాధితురాలు గురువారం డిస్‌పిని కలిసి ఫిర్యాదు చేసింది. ఆమె ఇంట్లో అద్దెకు ఉంటున్న తోలేటి ఓంప్రకాష్ కోసం దున్నాల దుర్గ అతని అనుచరులు ఇంటికి వచ్చి వీరంగం చేశారు. 'మీకు ఎమన్నా గొడవలు ఉంటే బయట చూసుకోవాలి' అని టేకు వెంకటలక్ష్మి వారికి చెప్పింది. దీంతో 'కులం తక్కువ దాన నువ్వు మాకు చెప్తావా అంటూ' దున్నాల దుర్గపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఇంతలో బయటకు వచ్చిన తోలేటి ఓంప్రకాష్‌పైనా వారు దాడికి దిగారు. అతనిపై పిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోడం లేదని రాజకీయ పలుకుబడి ఉపయోగించి కేసు నుంచి దున్నాల దుర్గను తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొంది. తనపై దాడి చేసిన దున్నాల దుర్గ, దున్నాల దిలీప్, కంచిపల్లి శ్రీను, జక్కపు ప్రసాద్, ఏలూరి అయ్యప్పలపై కేసు నమోదు చేయాలని కోరింది.

వ్యక్తి మృతికి కారణమైన వారికి రిమాండ్

ప్రజాశక్తి-చాగల్లు

ఊనగట్ల గ్రామంలో గత నెల 29న ఒక వ్యక్తి మృతికి కారణమైన వారికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. బోనం సుబ్బారావు(54)ను పాత గొడవల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన ధూపాటి శ్రీనివాస్, అతని కుమారుడు సత్యనారాయణ చేతులతో కొట్టి గెంటి వేయగా, సిమెంటు రోడ్డుపై పడడం వల్ల సుబ్బారావు తలకు గాయంతో మరణించారు. ఈ కేసులో నిందితులను కొవ్వూరు రూరల్ సిఐ కె.విజయ్ బాబు అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

కాటవరం గ్రామం చెరువు మలుపు వద్ద గురువారం ఒక ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ సహా నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రయాణికులు కాతేరు గ్రామం నుండి చినకొండేపూడి గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని వెంటనే అంబులెన్స్‌లో రాజమండ్రిలోని ఆసుపత్రికి తరలించారు.

జామాయిల్ తోట నరికివేతపై కేసు

ప్రజాశక్తి-గోపాలపురం

ఐదు ఎకరాలలో ఉన్న జామాయిల్ తోటను అక్రమంగా నరికి కర్రలను దొంగలించిన 13 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. మండలంలోని బీమోలు గ్రామ రెవెన్యూ పరిధిలో షేక్ యాకుబ్‌కు చెందిన 5 ఎకరాలల్లో ఉన్న జామాయిల్ తోటను ఈ నెల 3న అదే గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా నరికివేసి జామయిల్ కర్రలను అపహరించారు. దీనిపై రైతు యాకూబ్ సాహెబ్ ఫిర్యాదు మేరకు మొత్తం 13 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రఘుదేవపురం రవీంద్ర కాలనీ వద్ద గల ఒక ఇటుక బట్టీలో గురువారం విషాద సంఘటన చోటు చేసుకుంది. ట్రాక్టర్ ప్రమాదవశాత్తు తిరగబడటంతో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. గ్రామానికి చెందిన సిద్దా వెంకన్న (55) తన సొంత ఇటుక బట్టీలో ట్రాక్టర్‌తో మట్టిని తొక్కుతున్నాడు. ఈ సమయంలో అదుపుతప్పి ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకన్న ట్రాక్టర్ కింద పడిపోవడంతో తీవ్రమైన గాయాలపాలయ్యాడు. వెంటనే తోటి పనివారు స్పందించి వెంకన్నను ట్రాక్టర్ కింద నుంచి బయటకు తీశారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రిలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. వెంకన్నకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

13 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో వర్షా కాలంలో భవన నిర్మాణ రంగ అవసరాలకు సుమారు 13 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ యార్డ్‌లో నిల్వలు చేయనున్నటు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లాస్థాయి విశ్వ కమిటీ సమావేశం కలెక్టర్ కమిటీ ఛైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐదు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచులకు పర్యావరణ అనుమతులు వచ్చాయన్నారు. త్వరలో ఇసుక తవ్వకాల నిర్వహణ కొరకు టెండర్లు ఖరారు చేస్తూ ఈనెల 30 నాటికి ఇసుక తవ్వకాలు ప్రారంభించి స్టాక్ యార్డులకు ఇసుకను తరలించి నిల్వలు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్ లు ఆపరేషన్ కొరకు కనీసం ఐదు ప్రక్క జిల్లాల విధి విధానాలపై అధ్యయనం చేస్తూ ఈనెల 16 నాటికి కార్యాచరణ సిద్ధపరచాలని జెసికి సూచించారు. ప్రస్తుతం పనిచేస్తున్న టాస్క్ ఫోర్స్ టీమ్ లను బలోపేతం చేస్తూ అక్రమ ఇసుక త్రవ్వకాలు రవాణాను నిరోధించాలన్నారు. అదేవిధంగా సెమీ మెకనైజ్డ్ రీచ్ లు కమిటీలో సభ్యులుగా ఉన్న డ్వామా పిడి, ఆర్ అండ్ బి స్. ఎస్.ఇ, జల వనరుల శాఖ ఇంజనీర్, జిల్లా రిజిస్టర్, జిల్లా ఆడిటర్లు సెమీ మె కనైజ్డ్ రీచ్ లు ఆపరేషన్స్ పై విధివిధానాలపై నిష్పక్షపాతంగా విధానాలు ఉండేటట్లు రూపొందించాలన్నారు. ఈనెల 17న టెండర్లు పిలిచి ఈ నెల 22న ఫైనలైజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 16న సెమీ మె కనైజ్డ్ రీచుల కార్యకలాపాలపై మరొకసారి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి నిర్దిష్టమైన విధివిధానాలను కమిటీ సభ్యులు అనుమతితో ఖరారు చేస్తారన్నారు. ఈ ఐదు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచులలో సుమారు 21 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. కొత్తపేట, రావులపాలెం, కపిలేశ్వరపురం, అమలాపురంలో స్టాక్ యార్డు లు ఏర్పాటు చేశామన్నారు. గత ఏడాది కేవలం వర్షాకాలం సీజన్లో 6.25 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వలు చేయడం జరిగిందని విస్తరిస్తున్న భవన నిర్మాణ రంగాన్ని భవిష్యత్తు అవసరాలను దష్టిలో ఉంచుకొని దీనిని రెట్టింపు చేస్తూ 13 నుండి14 లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వలు ఉండే విధంగా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. రావులపాలెం జాతీయ రహదారి-16 కు దగ్గరగా 8 లక్షలు, అమలాపురం స్టాక్ యార్డ్ లో 3 లక్షలు, తూర్పు డెల్టా గౌతమి ప్రాంతంలో 3 లక్షలు మెట్రిక్ టన్నులు నిల్వలు చేయనున్నట్లు తెలిపారు. ఈ స్టాక్ యార్డ్‌కు సంబంధించి యాక్సిస్ బులిటి రోడ్లు, పార్కింగ్ సౌకర్యాలపై వేయింగ్ బ్రిడ్జిలు వంటి వసతులపై అధ్యయనం చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. సెమీ మెకనైజ్డ్ రీచుల నిర్వహణ ఏజెన్సీలకు స్టాక్ యార్డ్ లలో ఇసుక తరలింపు కూడా అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉచిత ఇసుక పాలసీలో ఉన్న విధివిధానాల ప్రకారం స్టాక్ యార్డ్ లను బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు సుమారు 15 వేల మెట్రిక్ టన్నులు ఇసుక తవ్వకాలు నిర్వహించి స్టాక్ యార్డులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం ఇసుక తవ్వకాలకు సంబంధించి మే, జూన్ మాసాలు మాత్రమే అనువుగా ఉంటాయన్నారు. స్టాక్ యార్డులు సెమీ మెకనైజ్డ్ రీచ్ లు మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఐదు సెమీ మెకనైజ్డ్ రీచులలో ఇసుక త్రవ్వకాలు పూర్తి స్థాయిలో చేపట్టిన అనంతరం ఒక సినీ మెకనైజ్డ్ రీచ్ ను కాకినాడ జిల్లా భవన నిర్మాణ అవసరాలకు కేటాయిస్తారన్నారు. ప్రస్తుతం స్టాక్ యార్డు లలో కేవలం 1,92,000 మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. కొన్ని మ్యానువల్ రీచ్ ల నుండి కూడా ఇసుకను స్టాక్ యార్డ్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డి పట్టా భూములలో ఇసుక తవ్వకాలు నిర్వహణకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు రావాల్సి ఉందని, ఇవి వచ్చిన పిదప సంబంధిత భూ యజమాన్యాలు రోజు వారీగా సుమారు 500 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉంటే వారికే ఇవ్వాలని లేని పక్షంలో మాన్యువల్ మాదిరిగా టెండర్లు పిలవాలని కమిటీ సభ్యులకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు గుర్తించిన డి పట్టా భూములలో సుమారు 99,300 మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వలు ఉన్నాయన్నారు. స్టాక్ యార్డులలో ఇసుక నిలువలను వినియోగదారులకు సరఫరా చేసేందుకై ముందుగా అమలాపురం స్టాక్ యార్డ్ కు చార్జీలు నిర్ణయిం చాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. డి పట్టా భూములలో ఇసుకను తరలించే మార్గాలలో బలహీనమైన వంతెనలు ఉన్నట్లయితే ఓవర్ లోడ్‌తో వాహనాలు రాకపోకలు సాగించకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. ముఖ్యంగా అమలాపురం చుట్టుపక్కల బలహీన వంతెనలు గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఉచిత ఇసుక పాలసీ నిబంధనలకు అనుగుణంగా ఇసుక తరలించే వాహనాలు ఇసుకపై తప్పనిసరిగా టార్పాలిన్ కప్పి తరలించాలని ఆదేశించారు. అదేవిధంగా ఓవర్ లోడ్ విషయంలో రవాణా అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. బల్క్ వినియోగదారులు సాధారణ వినియోగదారుల కూపన్లు జనరేషన్ విధివిధానాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, ఆర్‌డిఒలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, భూగర్భ గనుల శాఖ ఎడి ఎల్.వంశీధర్ రెడ్డి, గోదావరి హెడ్ వర్క్స్ ఇఇ కాశీ విశ్వేశ్వరరావు, ఆర్‌టిఒ డి.శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ డిఇ పద్మనాభం, జిఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ సువిజయ్, ఆర్అండ్‌బి ఎస్ ఇ బి.రాము, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రొటోకాల్ ఉల్లంఘనపై సర్పంచ్ ఆగ్రహం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


ఫొటోలతో వివరాలు తెలుపుతున్న సర్పంచ్

ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో సర్పంచ్ ప్రొటోకాల్ ను ఉల్లంఘిస్తూ తనను అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని విలసవిల్లి సర్పంచ్ సలాది ఊర్మిళదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో జరుగుతున్న పరిస్థితులను వివరిస్తూ గురువారం సర్పంచ్ ఊర్మిళదేవి ప్రకటన విడుదల చేశారు. గ్రామానికి ప్రథమ పౌరురాలు అయిన తాను గ్రామంలో ఏ అధికారిక కార్యక్రమం జరిగిన అందులో పాల్గొనవలసి ఉందని సమాచారం అందించాలని తెలిపారు. ఇటీవల గ్రామంలో చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం నుండి సోలార్ సిస్టంలను పంపిణీ చేస్తున్నట్టు సంబంధిత అధికారులు తమకు సమాచారం అందించారని తమకు సమాచారం అందించిన సంగతి తెలిసిన గ్రామంలోని ఓ వర్గం నాయకులు ఆరోజు కార్యక్రమం జరగకుండా వాయిదా వేశారని తెలిపారు. ధికారికంగా జరగవలసిన కార్యక్రమాన్ని రద్దు చేసి మరుసటి రోజు రహస్యంగా ఎంఎల్ఎ సమక్షంలో తమకు సమాచారం లేకుండా స్థానిక ఎంపిటిసి సభ్యుని చేతుల మీదుగా పంపిణీ చేసి తనను అవమానించే విధంగా వ్యవహరించారని తెలిపారు.అలాగే గ్రామంలో ఎంపిటిసి నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు శంకుస్థాపన కార్యక్రమాన్ని కూడా సర్పంచ్ గా తనకు సమాచారం అందించకుండా ఆ కార్యక్రమాన్ని నిర్వహించారని సర్పంచ్ ఊర్మిళదేవి తెలిపారు. ఎంపిటిసి భర్త వేరే మండలంలో ఎస్ఎంఆర్ ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తూ గ్రామంలో జరిగే ప్రత్యక్ష రాజకీయ కార్యక్రమాల్లో అధికారికంగా పాల్గొంటూ సర్పంచ్ ప్రొటోకాల్ ఉల్లంఘన సమస్యను తీసుకురావడం ఎంతవరకు సబబు అని సర్పంచ్ ఊర్మిళదేవి ప్రశ్నించారు. గ్రామంలో జరుగుతున్న పరిస్థితులపై సంబంధిత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఊర్మిళదేవి ఆ ప్రకటనలో కోరారు.


అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ

ఓటర్ల జాబితా రూపకల్పనలో పారదర్శకత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఓటర్ల జాబితా రూపకల్పనలో అధికారులు పారదర్శకత పాటించాలని డిఆర్ఒ టి.సీతారామ్మూర్తి సూచించారు. గురువారం ఆయన తన ఛాంబర్‌లో అసెంబ్లీ నియోజక వర్గాల ఇఆర్ఒలు, ఇతర సిబ్బందితో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎన్నికల అధికారి నుంచి బూత్ లెవెల్ అధికారి వరకు ఓటరు జాబితా రూపకల్పనలో అధికారులందరూ పారదర్శకంగా పని చేయాలన్నారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా గురుతరమైన బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఏదైనా ఉద్దేశపూర్వక ఉల్లంఘన జరిగితే, సంబంధిత అధికారిని జవాబుదారీగా చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఓటరు నమోదు, తొలగింపు నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని, తగిన ఆధారాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. పోలింగ్ బూత్‌ల హేతుబద్ధత కలిగి ఉండేలా 800 నుండి 1200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ స్టేషన్‌ల సమీక్ష చేపట్టడం, ప్రతి ఓటర్ల నివాసం నుండి 2 కిలోమీటర్ల దూరంలో పోలింగ్ స్టేషన్ ఉండేలా వివరణాత్మక కసరత్తును చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎలెక్టోరల్ రిటర్నింగ్ అధికారులు పి.భాగ్యలక్ష్మి, ఎంఆర్ఆర్.ప్రేమ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి సోమును కలిసిన నర్సరీ రైతులు

ప్రజాశక్తి-కడియం

ఇటీవల శాసన మండలి సభ్యులుగా రెండవసారి ఎన్నికైన సోము వీర్రాజుని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, పాలకవర్గ సభ్యులు గురువారం కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సరీ రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సోము వీర్రాజుకు విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎంఎల్‌సి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బోడపాటి గోపాలకృష్ణ, కొండేపూడి నాగు, తాడాల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, రత్నం బాబ్జి, పిల్లా శ్రీనివాస్, గాద నాగేశ్వరరావు, క్రొవ్విడి వాసు, ఆకుల శ్రీధర్, బొరుసు సుబ్రమణ్యం, జెమ్మి పాల్గొన్నారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

వడదెబ్బ తగిలి ఒక వ్యక్తి మతి చెందిన సంఘటన గొల్లప్రోలు మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎకె.మల్లవరం గ్రామంలో సంది పత్తుల లక్ష్మణరావు(50) కనకదుర్గమ్మ ఉత్సవ ఊరేగింపులో వడదెబ్బ తగిలి కింద పడిపోయాడు. వెంటనే పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

పిడిఎఫ్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని వన్నెపూడి గ్రామంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పోలీస్, రెవెన్యూ, సివిల్ సప్లై సిబ్బంది సంయుక్తంగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న కర్రి లక్ష్మీనారాయణకు చెందిన ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఉప్పాడ గాంధీ నగరం వద్ద..

యు.కొత్తపల్లి: ఉప్పాడ గాంధీ నగరం వద్ద ఉన్న సాయిబాబా ఆలయ సమీపంలో గురువారం చిత్రాడ దొరబాబు నిల్వ ఉంచిన రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. అక్రమ రేషన్ బియ్యాన్ని నిల్వ చేసిన దొరబాబుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యంత్రాంగం

గండేపల్లిలో..మండలంలోని బొర్రంపాలెం 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో హెచ్‌టి, వ్యవసాయ కనెక్షన్‌లకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని విద్యుత్ శాఖ ఎఇ కిరణ్‌కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కాట్రావులపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ ఫీడర్‌పై చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గండేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని ఎన్‌టి.రాజాపురం ఫీడర్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు. **సామర్లకోటలో...**పట్టణంలోని 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం సామర్లకోట, పెద్దాపురం మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్టు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. **పిఠాపురంలో..**11 కెవి ఫీడర్ మెయింటినెన్స్‌లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఎఇఇ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నర్సింగపురం, జములపల్లి, కోలంక, కుమారపురం, ఫక్రుద్దీన్‌పాలెం, కందరాడ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - కరప

మండలంలోని రబీలో సాగు చేసిన వరి పంటను కొనుగోలు చేసేందుకు 15 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతు సేవ కేంద్రంలో ధాన్యం కొనుగోలు సిబ్బంది గ్రామ వ్యవసాయ సహాయకుల పర్యవేక్షణలో విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులందరికీ కనీస మద్దతు ధర కామన్ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కి రూ.2300 లేదా 75 కేజీలు బస్తాలకు రూ.1725, గ్రేడ్ ఎ రకానికి క్వింటాల్‌కు రూ.2320, 75 కేజీలు బస్తాకు రూ.1740 చెల్లించడం జరుగుతుందని తెలిపారు. గోనెసంచులు, హమాలీ, రవాణాను రైతులు ఏర్పాటు చేసుకుంటే అందుకయ్యే ఖర్చును ప్రభుత్వం సంబంధిత రైతు ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు.

పలువురిని సత్కరించిన రైతులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

రబీలో నీటి ఎద్దడి లేకుండా కృషి చేసిన నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది, సాగునీటి సంఘాల ప్రతినిధులను రైతులు సత్కరించారు. మండలంలోని పి.మల్లవరం గ్రాంటు ప్రాంతంలో ఈ ఏడాది నీటి ఎద్దడి తలెత్తింది. దీనిపై డిఇ పోచారావు, ఎఇ అనూష కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఒఎన్‌జిసి పైపులైన్ ద్వారా సాగునీటిని, టేకి, ఆత్రేయ డ్రెన్ మిగులు జలాలను పంపింగ్ చేసి గ్రాంటు ప్రాంత లోని ఆయకట్టును కాపాడారు. దీనికి కృతజ్ఞతగా రైతులు గురువారం ఇరిగేషన్ అధికారులను సత్కరించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వేగేశ్నభాస్కరరాజు మాట్లాడుతూ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు కృషితో కొంత మేరకు నీటి ఎద్దడి రాకుం డా చర్యలు తీసుకున్నామని అన్నారు. వచ్చే ఏడాది రబీ నాటికి ఇంజరం వంతెన పూర్తి చేసి నీటి ఎద్దడి సమస్యను నివారిస్తామన్నారు. అనంతరం రైతు నాయకులు సూరంపూడి శ్రీను అధ్యక్షతన నీటి సం ఘం డైరెక్టర్లు పేరాబత్తుల సాయి, రాయుడు వీర్రాజు, బాదం వీర వెంకట సత్యనారాయణ, రైతులు పితాని సత్తిబాబు, బాదం ఏడుకొండలు, కావూరి వెంకన్న, పితాని రామకష్ణ అధికారులను సత్కరించారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని జడ్.రాగంపేటకు చెందిన బొడ్డు వెంకటశ్రీనివాస్‌కు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కోసం రూ.7,83,346 చెక్కును గురు వారం ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం తో బాధపడుతూ, వైద్యానికి ఆర్థికస్తోమత లేని బాధితులు సాయం కోసం సిఎంఆర్ఎఫ్ సాయం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కందుల చిట్టిబాబు, కందుల కొండయ్య చౌదరి పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో గురువారం స్థానిక చాచా విద్యా నికేతన్ 8వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రంలో విద్యుత్ ప్రవాహం వల్ల కలిగే రసాయన ఫలితం పాఠ్యాంశం కు సంబంధించిన అనేక ప్రయోగాలు విద్యార్థులతో చేయించారు.

జిల్లా మాల మహానాడు జెఎసి సమావేశం

ప్రజాశక్తి - రావులపాలెం

కూటమి ప్రభుత్వం ఎస్. సి వర్గీకరణకు అనుకూలంగా వేసిన వన్ మ్యాన్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా సిఫారసులను మంత్రి మండలి, అసెంబ్లీ ఆమోదం తెలపడాన్ని వ్యతిరేకిస్తూ మాల మహానాడు జెఎసి ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ కోనసీమ జిల్లా మాలమహానాడు జాయింట్ యాక్షన్ కమిటీ రావులపాలెం లో సమావేశమయ్యారు. స్థానిక ఆదిలక్ష్మి పుంత కొత్త కాలనీ రోడ్డులో గల గెస్ట్ హౌస్‌లో కప్పల శ్రీధర్ అధ్యక్షతన జెఎసి నాయకులు డిబి.లోక్, ఇసుకపట్ల రఘుబాబు, గొల్లపల్లి డేవిడ్‌రాజు, జంగ బాబురావు నెల్లి లక్ష్మీపతి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కార్యక్రమం లో కొనాల రాజు, గాడి క్రిష్టాఫర్, కుసుమే ప్రవీణ్‌కుష్మి రాంబాబు, ఎడ్ల రాయుడు, వీర్రాజు దావీదు, ఉండ్రు నాగరాజు నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.


రావులపాలెంలో జరిగిన మాలమహానాడు సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన జెసి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఉన్న రైతు సేవా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా గురువారం సందర్శించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, ధాన్యం కొనుగోలు సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యంను అమ్మకం చేయాలని మైకులు, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రైతులు మద్దతు ధర కన్నా తక్కువకు అమ్మకం చేపట్టవద్దని తెలిపారు. రైతులకు అవసరమైన గోనె సంచులు సకాలంలో కొనుగోలు కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా సివిల్ సప్లై అధికారి ఎండి.నాయక్, డిఇఒ మురళీకృష్ణ, తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ, సొసైటీ సెక్రటరీ ఎ.సూరిబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సింగరంపాలెం గ్రామంలో రూ.3.29 కోట్లతో చేపట్టే విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన చేశారు. టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహనరావు తండ్రి పోతుల వీర్రాజు జ్ఞాపకార్థం ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని ప్రభుత్వానికి దానం చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మండలంలో మొత్తం 7 సబ్ స్టేషన్‌లు ఉండగా వాటిలో 6 సబ్‌స్టేషన్లను టిడిపి పాలనలోనే నిర్మించడం జరిగిందన్నారు. ప్రస్తుతం చేపట్టిన సబ్ స్టేషన్ నిర్మాణం వల్ల సింగరంపాలెం, రామయ్యపాలెం, ఎన్‌టి రాజాపురం గ్రామాల్లో ఉన్న 400 బోర్లకు సవవృద్ధిగా విద్యుత్ సరఫరా అవుతుందని, గృహాలకు వోల్టేజ్ సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చలగల్ల దొరబాబు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ గొర్ల ప్రసాద్ పాల్గొన్నారు.